సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి

చంద్రయాన్–3 విజయం.. అంతరిక్ష పరిశోధనలపై యువతలో ఆసక్తిని కలిగించిందని డీసీపీ–2 కె.ఆనందరెడ్డి అన్నారు. 8లో



బీజేపీని దించితేనే భవిష్యత్

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే ప్రభుత్వ సంస్థలకు రక్షణ లభిస్తుందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి అన్నారు. 8లో

క్రీడా పోటీలకు సై



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 17 క్రీడా పోటీలకు అంతా సిద్ధమైంది. శుక్రవారం నుంచి ఈ నెల 13 వరకు జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయి. 8లో

న్యూస్‌రీల్

2,596 మందికి వైద్యం

కొనసాగుతున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



గంగవరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మహారాణిపేట: జిల్లాలో గురువారం ఏడు ప్రాంతాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 2,596 మందికి సేవలందించినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. అర్బన్ పరిధిలో గంగవరం(గాజువాక), సాగర్‌నగర్, ములగాడ(మల్కాపురం), పెందుర్తి పరిధిలో పెదగాడి, రేవడి–పద్మనాభం పరిధిలో మద్ది, భీమిలి పరిధిలో ఆర్.తాళ్లవలస–తాటితూరు, ఆనందపురం పరిధిలో చందకలో శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులను పరీక్షించి.. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

నేడు ఏడు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శుక్రవారం ఏడు ప్రాంతాల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. అర్బన్ పరిధి అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలోని యూపీహెచ్‌సీ, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని యూపీహెచ్‌సీ, కంచరపాలెం రామ్మూర్తిపంతుల పేట యూపీహెచ్‌సీ, రూరల్‌లో పెందుర్తి పరిధి గుర్రంపాలెం, ఆనందపురం పరిధి గిరిజాల, భీమిలి పరిధి లక్ష్మీపురం, పద్మనాభం పరిధి పాండ్రంగిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


86 నర్సు పోస్టులకు 9,100 దరఖాస్తులు

మహారాణిపేట: స్టాఫ్ నర్సు పోస్టుల దరఖాస్తు గడువు గురువారంతో ముగిసింది. రాష్ట్రంలో 434 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా.. జోన్–1 పరిధిలో మొత్తం 86 నర్సు పోస్టుల కోసం గత నెల 20 నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జోన్–1 పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 9,100 మంది గడువు ముగిసే సమయానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను పరిశీలన చేస్తున్నామని.. త్వరలోనే అర్హుల జాబితా విడుదల చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి వెల్లడించారు.

యాంటీ లార్వా ఆపరేషన్‌కు తాత్కాలిక సిబ్బంది

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో యాంటీ లార్వా ఆపరేషన్‌కు కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు 399 మందిని నెల రోజులకు తాత్కాలిక పద్ధతిపై నియమించినట్లు బయాలజిస్ట్ సాంబమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. డెంగ్యూ తీవ్రతను బట్టి సీజనల్ సిబ్బందిని కొనసాగించడం లేదా తొలగించడం జరుగుతుందని అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ స్పష్టం చేశారని ఆయన వివరించారు.

షిప్‌యార్డ్ ఉద్యోగులకు మారిటైమ్ అవార్డులు



అవార్డులతో షిప్‌యార్డ్ ఉద్యోగులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఉద్యోగులు మూడు మారిటైమ్ ఎక్స్‌లెన్సీ అవార్డులను దక్కించుకున్నారు. ముంబయిలో గురువారం అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఉత్తమ షిప్ రిపేర్ విభాగంలో సీనియర్ మేనేజర్ మాధవరావు, ఉత్తమ టెక్నాలజీ ఇన్నోవేషన్, వుమెన్ లీడర్‌షిప్ విభాగంలో మహిళా ఉగ్యోగులు లీలామాధవి, భానుప్రియ ఈ అవార్డులు స్వీకరించారు.

స్టార్టప్ స్టార్స్

- రాష్ట్ర స్థాయి సదస్సుకు హాజరైన పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు
- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సదస్సు ఎంతో ఉపయుక్తమని ఉద్ఘాటన
- గతంలో ఈ తరహా నిర్వహించలేదని కితాబు

సాక్షి, విశాఖపట్నం: మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న సదస్సుకు విశేష స్పందన లభించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళా పారిశ్రామికవేత్తలు ఈ సదస్సులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ (ఏపీఐఎస్) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరగనున్న రాష్ట్ర స్థాయి ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో గురువారం ప్రారంభమైంది. మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అధికారులు వివరించారు. సందేహాలను నివృత్తి చేశారు. స్టార్టప్ కంపెనీల నిర్వాహకులు ఒకరికొకరు తమ అనుభవాలను పంచుకున్నారు. విజయగాథలను వివరించారు. సదస్సులో పాల్గొన్న మహిళా పారిశ్రామికవేత్తలు గతంలో ఈ తరహా సదస్సులు జరగలేదని, స్టార్టప్ కంపెనీల నిర్వాహకులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేశారు. సదస్సులో పాల్గొన్న వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..



ఎంవోయూ పత్రాలను ప్రదర్శిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఐటీ కార్యదర్శి కోన శశిధర్, ఏపీఐఎస్ సీఈవో అనిల్‌కుమార్, ఎడ్వెంచర్ స్కూల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి శశిరేఖ

గత ప్రభుత్వాలకు భిన్నంగా..



నేను తిరుపతి నుంచి ఈ సదస్సుకు వచ్చాను. మా స్టార్టప్ కంపెనీ ద్వారా స్కూళ్లకు యూకేలో మాదిరిగా సర్వీసులను ప్రొవైడ్ చేస్తున్నాం. మహిళా పారిశ్రామికవేత్తల కోసం నిర్వహించిన ఈ సదస్సులో ఎన్నో విషయాలు తెల్సుకున్నాను. ఈ సదస్సు స్టార్టప్ కంపెనీల నిర్వాహకులకు మంచి ప్లాట్‌ఫాం. మాలాంటి వారెందరికో ప్రయోజనం చేకూరుతుంది. మునుపటి ప్రభుత్వాల్లా కాకుండా ఈ ప్రభుత్వం సదస్సుల్లో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలు కార్యాచరణలో పెడుతోంది. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మేం ఎంఓయూ కుదుర్చుకున్నాం.

– జి.శశిరేఖ, ఎడ్వెంచర్ స్కూల్ ప్రైవేట్ లిమిటెడ్, తిరుపతి

ఆలోచనల ఆచరణకు దోహదం



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సదస్సు వల్ల సాటి స్టార్టప్ కంపెనీల నిర్వాహకులు ఒకరికొకరు ఆలోచనలు పంచుకోవడానికి, అవి సరైన రీతిలో కార్యరూపం దాల్చడానికి, నైపుణ్యాన్ని పెంచుకోవడానికి దోహదపడుతుంది. నెట్‌వర్క్ విస్తృతం అవుతుంది. మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న సహకారం, పథకాలు, వాటిని ఎలా పొందవచ్చో తెలుస్తుంది. ఆధునిక సాంకేతికత, గ్లోబల్ పొజిషనింగ్ గురించి మరింత అవగాహన కలుగుతుంది. కోవిడ్ సెకండ్ వేవ్ తర్వాత వచ్చిన ఆలోచనతో తమ స్టార్టప్ కంపెనీ ద్వారా మెడెక్స్ ఫోర్స్ పేరిట మెడికల్ యాప్ ద్వారా నర్సింగ్ సేవలందిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న 500 నర్సుల సంఖ్యను లక్షకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– శ్రీనిజ రామచంద్ర, ఆర్‌క్యూబీ టెక్నాలజీస్, విశాఖపట్నం

ఔత్సాహికులకు దిశానిర్దేశం



నేను పదేళ్ల క్రితం విజయనగరంలో ఆన్‌లైన్ ద్వారా మరింత మెరుగ్గా టీచింగ్ ఎలా చేయాలన్న దానిపై సాఫ్ట్‌వేర్ ప్రొడక్టును తయారు చేశాను. ఇది మంచి ఫలితాలనిస్తోంది. గూగుల్‌కు అంబాసిడర్‌గానూ ఉన్నాను. గూగుల్ తరఫున 'స్టార్టప్ సక్సెస్ డేస్'కు పనిచేస్తున్నాను. ఈ మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు ద్వారా స్టార్టప్ కంపెనీలకు ఫండింగ్, ఎవరితో సంప్రదించాలి? సరైన మార్గంలో వెళ్తున్నామా? వంటి ఎన్నో అంశాలను నిపుణుల ద్వారా తెలుసుకునే వీలు కలిగింది. ఈ సదస్సు కొత్తగా స్టార్టప్‌లు ప్రారంభించాలనుకునే వారికే కాదు.. ప్రస్తుతం నడుపుతున్న వారికీ ఎంతో ఉపయోగపడుతుంది.

– వేమూరి ఉషా రమణి, ఫౌండర్, 'గురుజాడ' ఐటీ సొల్యూషన్స్, విజయనగరం

ఏపీఐఎస్‌తో ఎంఓయూ



మహిళలు, ఇతరులు నడుపుతున్న స్టార్టప్ కంపెనీలు ఎదుర్కొంటున్న సమస్యలే కాదు.. సాధించిన విజయాలను, నిర్వాహకుల అనుభవాలను తెలుసుకునే వీలు ఈ సదస్సు ద్వారా కలిగింది. అంతేకాదు.. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పాటు మెలకువలపై అధికారులు సమగ్రంగా అవగాహన కల్పించారు. ఇలాంటి సదస్సులు స్టార్టప్ కంపెనీల నిర్వాహకులకు ఎంతో ప్రయోజనకరం. ఈ రోజు సదస్సులో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ (ఏపీఐఎస్)తో హెడ్ స్టార్ట్ నెట్‌వర్క్ ఫౌండేషన్ పేరిట ఎంఓయూ కుదుర్చుకున్నాం.

– అశ్వథి వేణుగోపాల్, అవసర్‌శాల స్టార్టప్ కంపెనీ, గుంటూరు

గత సదస్సులకు భిన్నంగా..



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సదస్సు గత ప్రభుత్వాలకు భిన్నంగా ఉంది. మొక్కుబడిగా కాకుండా కార్పొరేట్ స్థాయిలో నిర్వహిస్తోంది. ఈ తరహా సదస్సులు గతంలో ఢిల్లీ, ముంబైల్లో జరిగాయని విన్నాం. ఒకరి ఉత్పత్తుల గురించి మరొకరు తెలుసుకునే వీలు కలుగుతుంది. ఈ వేదిక ద్వారా తమ ఉత్పత్తుల ఎక్స్‌పోజర్ పెరుగుతుంది. దంత వైద్యురాలి వృత్తి నుంచి స్టార్టప్ వైపు మళ్లాను. ముద్ర లైఫ్ కాస్టింగ్స్ పేరిట రెండు రోజుల పిల్లల నుంచి 95 ఏళ్ల వృద్ధుల వారికి త్రీడీ అచ్చులను తీసుకుని ఫ్రేమ్‌లు, బాక్సుల్లో వారికి కావలసిన రీతిలో రూపొందించి ఇస్తున్నాం.

– డాక్టర్ ప్రియాంక, పీఎం పాలెం, విశాఖపట్నం

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధి నరవ నీటి శుద్ధి కేంద్రం వద్ద ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ కేబుల్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్న దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ శేఖర్ తెలిపారు.

- జోన్–2 పరిధిలో మధురవాడ, పీఎం పాలెం, ఆరిలోవ సెక్టార్–1 నుంచి 12 వరకు, చినగదిలి, పెద్దగదిలి, విశాలాక్షినగర్.
- జోన్–3 పరిధిలో చిన్నవాల్తేర్, పెదవాల్తేర్, పాండురంగాపురం, రేసపువానిపాలెం, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, శివాజీపాలెం, మద్దిలపాలెం, చైతన్యనగర్, వినాయకనగర్, మంగాపురం కాలనీ, జాలారిపేట, ఆదర్శనగర్, వాసవానిపాలెం, ఎంవీపీకాలనీ సెక్టార్–1 నుంచి సెక్టార్ 12 వరకు, సీతంపేట, అక్కయ్యపాలెం, లలితానగర్, ఎన్జీవోస్ కాలనీ, శ్రీనివాసనగర్, నందగిరినగర్, నరసింహనగర్, గణేష్‌నగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్, సింహాద్రిపురం, లక్ష్మీనరసింహనగర్, పాతవెంకోజీపాలెం, దుర్గానగర్.
- జోన్–4 పరిధిలో వెలంపేట, టౌన్‌కొత్తరోడ్డు ఏరియా, రంగిరీజువీధి, మంతావారి వీధి, సున్నపు వీధి, రెల్లివీధి, జబ్బర్‌తోట, చిలకపేట, అల్లిపురం ప్రధాన రహదారి, నేరేళ్లకోనేరు, అమ్మవారి వీధి, కుమ్మరవీధి, కొబ్బరితోట, నేతాజీనగర్, అంబేడ్కర్ కాలనీ, జెండాచెట్టు, కలెక్టర్ కార్యాలయం ఏరియా, దండుబజార్, దిబ్బలపాలెం, జాలారిపేట, సాలిపేట, కేజీహెచ్, డాబాగార్డెన్స్, జగదాంబ, నీలమ్మవేపచెట్టు ఏరియా.
- జోన్–5 పరిధిలో రైల్వే న్యూకాలనీ, వేంకటేశ్వరకాలనీ, నరేంద్రనగర్, తాటిచెట్లపాలెం, సింగాలమ్మపురం, సింహగిరికాలనీ, కైలాసపురం, సంజీవయ్యకాలనీ, కప్పరాడ, ధర్మానగర్, తిక్కవానిపాలెం, కంచరపాలెం, రామ్మూర్తిపంతులపేట, సుభాష్‌నగర్, సిద్ధార్థనగర్, మహారాణివీధి, మర్రిపాలెం, కరాస, గౌరీనగర్, మురళీనగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది.

నో ట్రా'ఫికర్'

- రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు
- ప్రధాన జంక్షన్లలో పరిస్థితులను పరిశీలించిన అధికారులు



ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న డీసీపీ–2 ఆనంద్‌రెడ్డి

దొండపర్తి: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ ఉన్నతాధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఒకవైపు నేర నియంత్రణతో పాటు మరోవైపు ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు అనుసరించాల్సిన వ్యూహాల అమలుకు ఉన్నతాధికారులతో బృందాలుగా ఏర్పాటు చేశారు.

ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ పరిస్థితులు పరిశీలన

పోలీస్ ఉన్నతాధికారులు గత రెండు రోజులుగా నగరంలో ప్రధాన ప్రాంతాలు, జంక్షన్లలో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలిస్తున్నారు. డీసీపీ–1 కె.శ్రీనివాసరావు, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, ఏడీసీపీలు మద్దిలపాలెం, గాజువాక, ఇతర ప్రాంతాల్లో పర్యటించి చేపట్టాల్సిన చర్యలతో పాటు ట్రాఫిక్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇదిలా ఉంటే ఉదయం, సాయంత్రం సమయాల్లో అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. ఉద్యోగులకు, విద్యార్థులు ఆఫీసులకు, కాలేజీలకు వెళ్లే సమయంలో సహజంగానే రద్దీ ఏర్పడుతోంది. ఈ పరిస్థితుల దృష్ట్యా ఆయా ప్రాంతాల్లో కొంత ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారు.

బ్లాక్ స్పాట్లు గుర్తింపు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు మరోవైపు రోడ్డు ప్రమాదాల నివారణపై కూడా పోలీసులు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గత కొంత కాలంగా నగరంలో ఏయే ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగాయన్న విషయాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. అక్కడ వాహనాల స్పీడ్‌కు బ్రేకులు వేసేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోను, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న రహదారుల్లో అదనపు సిబ్బందిని నియమించాలని భావిస్తున్నారు. అదే విధంగా ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాహనదారులపై నిఘా పెట్టాలని ఆలోచన చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా, అతి వేగంగా, జిగ్‌జాగ్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

గృహసారధులే రథసారధులు

- ప్రభుత్వ మంచిని, ప్రతిపక్షాల కుట్రలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత మీదే..
- గృహ సారధులకు దిశానిర్దేశం చేసిన వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



సుబ్బారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ హరివెంకటకుమారి తదితరులు



వైవీ సుబ్బారెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు

దొండపర్తి: ప్రభుత్వం చేస్తున్న మంచిని, ప్రతిపక్షాల కుట్రలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత గృహసారధుల మీద ఉందని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం విశాఖ తూర్పు, ఉత్తర నియోజకవర్గాలలో గృహసారధులు, సచివాలయాల కన్వీనర్లతో జరిగిన సమావేశాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో వారు చేపట్టాల్సిన కార్యకలాపాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో గృహసారధులు, సచివాలయాల కన్వీనర్లే కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చిన విషయంతో పాటు ఆ పథకాలు ప్రజలకు అందకుండా ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను వివరించాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ కాంక్షలకు అనుగుణంగా 175/175 సీట్లు సాధించే దిశగా పార్టీ విజయానికి తోడ్పాటు అందించాలని చెప్పారు. మళ్లీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు అధికారంలోకి రావాలన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజలకు గుర్తు చేయాలన్నారు. ఒకవైపు సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రంలో హార్బర్లు, పోర్టులు, కొత్త పరిశ్రమలు, విమానాశ్రయం, కొత్త రహదారులు, రహదారుల విస్తరణ, ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నా.. పచ్చమీడియా వాటిని కప్పిపుచ్చి, టీడీపీ, జనసేన పార్టీల అసత్య ప్రచారాలు, కుట్రలకు వంతపాడుతున్నారని ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల దృష్ట్యా ఆ దుష్టచతుష్టయం కుట్రలను తిప్పుకొడుతూ ప్రజలతో మమేకమై వచ్చే ఎన్నికల్లో మళ్లీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తూర్పు సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

'పశ్చిమ'లో 300 మంది చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెం ప్రాంతంలో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సభలో 40, 58, 59, 60, 61, 62, 63 వార్డుల నుంచి సుమారు 300 మంది వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు అందరూ కృషి చేయాలని సూచించారు.

విద్యార్థుల అభ్యున్నతికి వసతి గృహాలు దోహదం



ఆధునికీకరించిన బీసీ వెల్ఫేర్ వసతిగృహం ప్రారంభోత్సవంలో కలెక్టర్ మల్లికార్జున

తగరపువలస: వెనుకబడిన విద్యార్థుల అభ్యున్నతికి వసతిగృహాలు దోహదపడతాయని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. భీమిలి కృష్ణాకాలనీలో దివీస్ లేబరేటరీ యాజమాన్యం రూ.36.40 లక్షల సీఎస్సార్ నిధులతో ఆధునికీకరించిన బీసీ సంక్షేమ సంఘం వసతి గృహాన్ని గురువారం ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా దివీస్ జనరల్ మేనేజర్ వై.కోటేశ్వరరావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కలెక్టర్ సూచించిన వెంటనే వసతిగృహం ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. దివీస్ ప్రతినిధులు వరహాలరెడ్డి, డి.సురేష్‌కుమార్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారులు వసంతకుమారి, జ్యోతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు.. ఆర్థిక నేరగాడు

స్పీకర్ తమ్మినేని



గోపాలపట్నం: చంద్రబాబు.. ఆర్థిక నేరగాడని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆరోపించారు. విజయవాడ నుంచి గురువారం సాయంత్రం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు చేసిన అవినీతి పుంఖానుపుంఖాలుగా బయటకు వస్తోందన్నారు. రాజకీయ కక్షతో ప్రభుత్వమే ఆయన్ని అరెస్ట్ చేయించిందనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. చట్ట ప్రకారమే ఆయన అరెస్ట్ అయ్యారని స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడి.. దేశంలోని చాలా మంది మాజీ ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్టయి జైలు శిక్షలు అనుభవించ లేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు చట్టాలకు అతీతుడు కాదని, అవినీతి చేసి జైల్లో సత్యాగ్రహం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆర్థిక నేరగాడికి బెయిల్ కావాలని టీడీపీ శ్రేణులు దీక్షలు చేయడమేంటని ఎద్దేవా చేశారు. అన్ని వ్యవస్థల కన్నా పౌర వ్యవస్థ గొప్పదని.. ఎవరేంటనేది ప్రజలే నిర్ణయిస్తారన్నారు.

వలంటీర్లపై పవన్ వ్యాఖ్యలను తిప్పికొట్టాలి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి పిలుపు



తగరపువలస: వలంటీర్లు రాజ్యాంగేతర పనులు చేస్తున్నట్లు ఆరోపిస్తున్న పవన్ వ్యాఖ్యలను అందరూ తిప్పికొట్టాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. భీమిలి మండలం తాటితూరులో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్రంలో కాపులను తీసుకువెళ్లి చంద్రబాబు వద్ద తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. సినీ హీరోలకు ఓట్లు రాలే కాలం చెల్లిపోయిందన్నారు. ఇటీవల టీడీపీ, జనసేన నాయకులు గోస్తనీ వంతెన కోసం చేస్తున్న ఆందోళనలపై ఎమ్మెల్యే స్పందించారు. తాను ఈ నాలుగున్నరేళ్లలో పదుల సంఖ్యలో తాటితూరు పంచాయతీలో పర్యటించానన్నారు. 2014 నుంచి 2019 వరకు గంటా శ్రీనివాసరావు భీమిలి నుంచి మంత్రిగా ప్రాతినిధ్యం వహించారని.. అప్పుడు టీడీపీ, జనసేన నాయకులు గాడిదలు కాసారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే గోస్తనీ నదిపై రీ ఎస్టిమేషన్‌తో వంతెన పనులు ప్రారంభమవుతాయన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు సంక్షేమ పథకాలు చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కరోనా వంటి విపత్కర సమయంలో కూడా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో పంచాయతీ ప్రజలకు రూ.15.50 కోట్ల సంక్షేమ పథకాలు అందించినట్లు వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ప్రజలు పోటెత్తగా.. ఇక్కడ అందుతున్న వైద్య సేవలపై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శించిన జగనన్న పోషకాహార స్టాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

అంతరిక్ష పరిశోధనలపై పెరిగిన ఆసక్తి

స్పేస్ వాక్ ప్రారంభించిన డీసీపీ-2 ఆనందరెడ్డి


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఆనందరెడ్డి

బీచ్‌రోడ్డు: చంద్రయాన్-3 విజయం భారతీయుల్లో కొత్త శక్తిని, అంతరిక్ష పరిశోధనలపై యువతలో ఆసక్తిని కలిగించిందని డీసీపీ-2 కె.ఆనందరెడ్డి అన్నారు. భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం(ఇస్రో), సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్), రఘు విద్యా సంస్థలు సంయుక్తంగా గురువారం బీచ్‌రోడ్డులో వాక్ ఫర్ స్పేస్ వీక్ నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద డీసీపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ అద్భుత విజయాలు సాధిస్తోందన్నారు. భవిష్యత్‌లో దీనిని మరింత అభివృద్ధి చేసి, ముందుకు నడిపించే బాధ్యత యువత తీసుకోవాలన్నారు. అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. షార్ శాస్త్రవేత్త, విశాఖ రీజియన్ కార్యక్రమ నిర్వహణ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న మాట్లాడుతూ అంతరిక్ష విజ్ఞానంతోనే మానవ అభివృద్ధి సాకారమవుతుందన్నారు. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు మాట్లాడుతూ షార్, ఇస్రో నిర్వహిస్తున్న నాలుగు రోజుల ప్రత్యేక కార్యక్రమాలను విద్యార్థులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షార్, ఇస్రో శాస్త్రవేత్తలు, రఘు విద్యా సంస్థల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, పోలీస్ అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్న ఈ ర్యాలీ ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగింది.

క్రీడా పోటీలకు సై

- నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు
- ప్రతిభ చూపితే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత
- ఉమ్మడి విశాఖ జిల్లాలో సిద్ధమైన వేదికలు



విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 క్రీడా పోటీలకు అంతా సిద్ధమైంది. శుక్రవారం నుంచి ఈ నెల 13 వరకు జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టి.నాగేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన నిర్వహించే పాఠశాల స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఇదో చక్కని అవకాశం. జిల్లా స్థాయి క్రీడా జట్లు ఎంపిక చేసేందుకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనువైన క్రీడా వేదికలను ఎంపిక చేశారు. పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏయే పోటీలు ఎక్కడంటే..

- బాలబాలికల అథ్లెటిక్స్ సెలక్షన్లు శుక్రవారం విశాలాక్షినగర్‌లోని డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో జరుగుతాయి.
- ఈ నెల 7న అండర్-14 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు పరవాడ పోలీసు స్టేషన్ ఎదురుగా జేఆర్ఎం కాలనీలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో, అండర్ -17 పోటీలు పరవాడలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తారు.
- ఈ నెల 8న అండర్-14, 17 బాలబాలికల రోల్‌బాల్ సెలక్షన్లు విశాఖలోని మురళీనగర్‌లో జరుగుతాయి.
- ఈ నెల 9న అండర్-14,17 బాలబాలికల యోగా సెలక్షన్లు పరవాడ ధర్మారాయుడుపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తారు. అండర్-17 బాక్సింగ్ సెలక్షన్లు నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయి. అండర్-14, 17 బాలబాలికల సేపక్‌తక్రా సెలక్షన్లు అనకాపల్లి జిల్లా కశింకోటలోని ఏఎస్ పేట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తారు. అండర్- 14, 17 ఆర్చరీ సెలక్షన్లు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు వ్యాలీ స్పోర్ట్స్ స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.
- ఈ నెల 10న అండర్-14 బాలుర బాక్సింగ్ సెలక్షన్లు విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో, అండర్-14 బాలబాలికల వాలీబాల్ పోటీలు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని తలారి సింఘిలో జరుగుతాయి. అండర్-14, 17 బాలబాలికల నెట్‌బాల్ సెలక్షన్లు భీమిలి సన్ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. అండర్-14, 17 బాలబాలికల స్కేటింగ్ సెలక్షన్లు విశాఖలోని వీఎంఆర్డీఏ పార్కులో జరుగుతాయి. అండర్-14, 17 బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు అనకాపల్లి ఎస్ఆర్‌జీ జిమ్‌లో నిర్వహించనున్నారు.
- ఈ నెల 11న అండర్-14 బాలబాలికల త్రోబాల్ సెలక్షన్లు విశాఖ జిల్లా కణితి జెడ్పీ హైస్కూల్‌లో, అండర్-14, 17 స్విమ్మింగ్ పోటీలు విశాఖపట్నంలోని రైల్వే స్విమ్మింగ్ పూల్‌లో జరుగుతాయి. అండర్ -14,17 బాలబాలికల ఫెన్సింగ్ పోటీలు అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. అండర్-14, 17 బేస్‌బాల్ పోటీలు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని వేములపూడి జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతాయి. పవర్‌లిఫ్టింగ్ పోటీలు అనకాపల్లి ఎస్ఆర్‌జీ జిమ్‌లో ఏర్పాటు చేశారు.
- ఈ నెల 12న అండర్-14, 17 బాలబాలికల కరాటే పోటీలు నగరంలోని స్వర్ణభారతి స్టేడియంలో, అండర్-17 క్రికెట్ సెలక్షన్లు అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో, అండర్-14, 17 చెస్ సెలక్షన్స్ అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు.
- ఈ నెల 13న అండర్ -14, 17 బాయ్స్ అండ్ గర్ల్స్ రోప్ స్కిప్పింగ్ పోటీలు అనకాపల్లి జిల్లా పరవాడ దగ్గర తానం ప్రభుత్వ హైస్కూల్‌లో, అండర్-14 క్రికెట్ పోటీలు పెందుర్తి సమీపంలోని పినగాడి వెల్ఫేర్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో, అండర్-14, 17 సాఫ్ట్‌బాల్ పోటీలు భీమునిపట్నం జీవీఎంసీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు నాగేశ్వరరావు వెల్లడించారు.

బీజేపీని గద్దె దించితేనే భవిష్యత్


ఐకమత్యం చాటుతున్న సీతారాం ఏచూరి, కార్మిక సంఘాల నేతలు

- ఇండియా కూటమి ప్రైవేటీకరణకు వ్యతిరేకం
- స్టీల్‌ప్లాంట్‌తో నాది ఎమోషనల్ అటాచ్‌మెంట్
- ప్లాంట్ రక్షణకు సొంత గనులు కేటాయించాలి
- బహిరంగ సభలో సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి

గాజువాక: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలకు రక్షణ లభిస్తుందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర యాత్ర ముగిసింది. ఈ సందర్భంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద గురువారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పబ్లిక్ సెక్టార్‌కు ప్రజలే యజమానులని, పాలకులు మేనేజర్లవంటివారని అన్నారు. యజమానులైన ప్రజల అనుమతి లేకుండా దేశ సంపదను మేనేజర్లు అమ్మలేరన్నారు. అలా అమ్మేసే వారిని బాధ్యతలనుంచి తొలగించడమే సరైందన్నారు. మోదీ ప్రభుత్వాన్ని అధికారానికి దూరంగా ఉంచడమే విశాఖ ఉక్కు రక్షణకు పరిష్కారమన్నారు. దేశ సంపదను ప్రధాని మోదీ కార్పొరేట్ సంస్థలకు, అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. రైతులకు అన్యాయం చేసి వ్యవసాయ రంగాన్ని అదానీ, అంబానీలకు అప్పగించాలని చూశారన్నారు. రైతుల సుదీర్ఘ పోరాటం చేయడంతో మోదీ వెనకడుగు వేయాల్సి వచ్చిందన్నారు. దేశంలో నిరుద్యోగం, ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. ఢిల్లీలో జీ-20 సదస్సు కోసం రూ.4,100 కోట్లు ఖర్చు చేసిన మోదీ ప్రభుత్వం రైతులకు మాత్రం అన్యాయం చేస్తోందన్నారు. తన మిత్రులైన కార్పొరేట్‌లకు రూ.16 లక్షల కోట్ల అప్పులను మాఫీ చేసిన మోదీ విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మాత్రం చర్యలు చేపట్టడం లేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 10 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను కేటాయించాలని, దీన్ని లాభాల్లో నడిపేందుకు ప్రత్యామ్నాయ చర్యలను ఆలోచించాలని సూచించారు. దేశంలో మతోన్మాద చర్యలు తీవ్రమయ్యాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా మోదీ అమృత్ కాల్ గురించి మాట్లాతుంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. 2024లో పెద్ద పెద్ద పోరాటాలు వస్తున్నాయన్నారు. 28 పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమితో పీఎస్‌యూలను కాపాడుకోవచ్చని, ఆ కూటమి తరఫున తాను వకాల్తా తీసుకొంటున్నానని అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకమని, పీఎస్‌యూలను కాపాడతామని కూటమి ఇప్పటికే ప్రకటించిందన్నారు. విశాఖ ఉక్కు మన హక్కు అని, ఈ ప్లాంట్‌తో తనకు చిన్నప్పటి నుంచి ఎమోషనల్ అటాచ్‌మెంట్ ఉందన్నారు. ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ప్రజలు, కార్మికులు పోరాటాన్ని బలంగా నిర్మించాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ తోటి కార్మికుల త్యాగ ఫలితాన్ని నిలుపుకోవడం కోసం ఉక్కు కార్మికులు ఐక్యంగా చేస్తున్న పోరాటం దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, సీపీఎం నాయకులు జగ్గునాయుడు, గంగారావు, లోకనాథం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, కె.ఎస్.ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీతో ఒప్పందం


ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ సెంటర్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్)తో గురువారం ఎంవోయూ కుదుర్చుకుంది. రాష్ట్రంలో ఉత్పత్తి చేసిన వివిధ ఆహార ఉత్పత్తులకు జీఐ ట్యాగ్‌ల దాఖలను ప్రోత్సహించనుంది. ఆహార ఉత్పత్తికి సంబంధించి మద్దతు, నైపుణ్యం, వనరుల మార్పిడికి సహకారం అందించనుంది. ఇందుకోసం సెమినార్లు, ఎగ్జిబిషన్లు, సింపోజియంలు, వర్క్‌షాపులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకోవడం కోసం ఈ ఒప్పందం జరిగింది. కార్యక్రమంలో డీఎస్ఎన్ఎల్‌యూ రిజిస్ట్రార్ జోగినాయుడు, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధికారులు చిరంజీవి చౌదరి, ఐఎఫ్ఎస్ ప్రిన్సిపాల్ సెక్రటరీ (అగ్రికల్చర్ మార్కెటింగ్, కో ఆపరేటివ్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫైనాన్స్, హెచ్ఆర్ సమక్షంలో ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు.

ఆధిక్యంలో ఆన్ష్, ప్రతీతి



విశాఖ స్పోర్ట్స్: అండర్-11 జాతీయ చదరంగం చాంపియన్‌షిప్‌లో ఆన్ష్, ప్రతీతి ఆధిక్యంలో కొనసాగుతున్నారు. పోర్ట్ ఇండోర్ స్టేడియంలో గురువారం ఎనిమిదో రౌండ్ పోటీలు జరిగాయి. ఓపెన్‌లో ఏడున్నర పాయింట్లతో ఆన్ష్(మహారాష్ట్ర), ఏడేసి పాయింట్లతో ఆయాన్(చండీగర్), సంజయ్(తమిళనాడు), మేహల్ సోంధీ(ఢిల్లీ), ఆరవ్(తమిళనాడు) తొలి ఐదు స్థానాల్లో నిలిచి తొమ్మిదో రౌండ్‌కు సిద్ధమయ్యారు. బాలికల విభాగంలో ఏడున్నర పాయింట్లతో ప్రతీతి(కర్ణాటక), ఏడేసి పాయింట్లతో హాన్య షా(గుజరాత్), త్రిపురాంబిక(ఆంధ్రప్రదేశ్) తొలి మూడు స్థానాల్లో నిలిచి తొమ్మిదో రౌండ్‌కు చేరుకున్నారు. మొత్తంగా 11 రౌండ్ల పాటు ఈ పోటీలు జరగనున్నాయి.

దిశ యాప్‌తో విదేశీ యువతికి రక్షణ

ఎంవీపీకాలనీ: జింబాబ్వే దేశస్తురాలు దిశ యాప్ ద్వారా రక్షణ పొందిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసిన ఆమె కృష్ణా కళాశాల దరి ఓ ఇంట్లో నివాసముంటోంది. ఆమె పట్ల మరో విదేశీ యువకుడు కొన్ని రోజులుగా అనుచితంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఆ యువకుడు బుధవారం అర్ధరాత్రి ఆమె ఉంటున్న ఇంటికి చేరుకుని అనుచితంగా ప్రవర్తించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో ఆమె దిశ యాప్ ద్వారా పోలీసులను ఆశ్రయించింది. ఐదు నిమిషాల్లోనే ఎంవీపీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమెకు రక్షణ కల్పించారు. యువకుడిని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం విడిచిపెట్టారు. ఏయూలో చదువుతున్న సమయంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నానని.. ఈ యాప్ ద్వారా వెంటనే రక్షణ పొందానని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	:రూ.110
బ్రాయిలర్ (లైవ్)	:రూ.130
స్కిన్	:రూ.230
స్కిన్‌లెస్	:రూ.240

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	532.00
విజయనగరం	536.00
శ్రీకాకుళం	536.00

యూపీఎస్సీ పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

డీఆర్వో మోహనరావు

మహారాణిపేట: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్-2023కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహనరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో గురువారం ఆయన సమీక్ష చేపట్టారు. ఈ నెల 7, 8 తేదీల్లో యూపీఎస్సీకి సంబంధించి కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని, మొత్తం 2,962 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. అభ్యర్థులు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు యూపీఎస్సీ నిబంధనలకు కచ్చితంగా పాటించాలని సూచించారు. అభ్యర్థులను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రాల్లోకి పంపించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షల నిర్వహణకు సహకరించాలని కోరారు. యూపీఎస్సీ పరిశీలకుడు ఎస్.హెచ్.రాహుల్ గార్గ్, పరీక్షల విభాగం సూపరింటెండెంట్ పాల్ కిరణ్, జీవీఎంసీ, పోలీస్, మెడికల్, ఈపీడీసీఎల్, లైజనింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

అల్లిపురం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 136 మంది వాహన చోదకులకు రూ.5.36 లక్షల జరిమానా, ఇద్దరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తులు గురువారం తీర్పు చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపిన వివరాలివీ.. నగరంలో పలు చోట్ల నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 136 మంది పట్టుబడ్డారు. వీరిని ఆయా కోర్టుల్లో హాజరుపరచగా.. వారికి న్యాయమూర్తులు రూ.5,36,100 జరిమానా విధించారు. మల్కాపురం పరిధిలో ఆయిల్ ట్యాంక్ లారీ డ్రైవర్‌కు మూడు రోజులు, గోపాలపట్నం పరిధిలో ఓ వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఈ సందర్భంగా సీపీ సూచించారు.

నిరాశ్రయ గృహాల నిర్వహణపై సమీక్ష


ఎన్జీవోలతో సమీక్షిస్తున్న పీడీ పాపునాయుడు

డాబాగార్డెన్స్: డే అండ్ నైట్ షెల్టర్ల నిర్వహణపై స్వచ్ఛంద సంస్థలతో యూసీడీ పీడీ పాపునాయుడు గురువారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నగరంలోని ఎనిమిది షెల్టర్ల స్థితిగతులు, మెరుగుపర్చాల్సిన అంశాలపై ఫొటోలతోపాటు సంక్షిప్త నివేదికను ఏయూటీడీ సంస్థ ద్వారా అందజేయాలని వారికి సూచించారు. ఈ నెల 10 ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవ నిర్వహణపై చర్చించారు. ఎన్జీవోలు సమష్టిగా రెస్క్యూ ఆపరేషన్ చేయాలని ఆదేశించారు.

'ఏపీ అమెచ్యూర్ కిక్ బాక్సింగ్' నూతన కార్యవర్గం


ఎమ్మెల్యే వాసుపల్లిని సత్కరిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

డాబాగార్డెన్స్: ఏపీ అమెచ్యూర్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం తన కార్యాలయంలో ప్రకటించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, అధ్యక్షుడిగా ఇంటర్నేషనల్ కిక్ బాక్సర్ కె.విమల్‌రాజు, ఉపాధ్యక్షులుగా అప్పారావు(అనకాపల్లి), సాంబ శివారెడ్డి(కాకినాడ), సుధాకర్(విశాఖపట్నం), ఎం.శరత్(పార్వతీపురం), కాళ్ల మహేష్(విజయనగరం), ప్రధాన కార్యదర్శిగా అంజిబాబు, సహాయ కార్యదర్శిగా తాయ్ ప్రకాష్(శ్రీకాకుళం), చీఫ్ అడ్వయిజర్స్‌గా కిలాని నరసింగ, నీలాపు శ్రీనివాసరావు(కేజీహెచ్), కోశాధికారిగా పి జగన్నాథం (రాజమండ్రి), సలహాదారులుగా జి.రాజేష్, ఎర్రయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నల్లా సోమేశ్వరరావు రామ్‌దేవ్, లీగల్ అడ్వయిజర్‌గా సీనియర్ న్యాయవాది బైపా అరుణ్‌కుమార్‌ను అసోసియేషన్ సభ్యులు ఎన్నుకున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన కిక్‌బాక్సర్లు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆచార్య కృష్ణమోహన్‌కు అభినందనలు


కృష్ణమోహన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రమణమూర్తి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఓఎస్డీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య వి.కృష్ణమోహన్‌ను గురువారం ఉత్తరాంధ్ర విద్యార్థి సేన, పలువురు ఆచార్యులు అభినందించారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, హెచ్ఆర్ఎం విభాగాధిపతి ఆచార్య అరుణ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య విజయమోహన్ ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ విద్య, పరిశోధన, పరిపాలన తదితర అంశాలపై విశేష అనుభవం ఉన్న ఆచార్య కృష్ణమోహన్‌ను ఓఎస్డీగా నియమించడం శుభపరిణామన్నారు. సేన ఏయూ ఇన్‌చార్జి సుబుద్ధి శ్రీరామ్, నాయకులు సన్యాసినాయుడు, చైతన్య, నాగరాజు, రాజశేఖర్, ప్రసాద్ ముల్లు మహేష్, కంఠం రెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. బాలాసోర్ -హల్దిపడ మధ్య జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం మరికొన్ని రైళ్లు రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. హౌరాలో గురువారం ఉదయం 8.30గంటలకు బయల్దేరవలసిన హౌరా-సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరింది. షాలిమార్‌లో గురువారం ఉదయం 11.25 గంటలకు బయల్దేరవలసిన షాలిమర్- హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.25 గంటలకు బయల్దేరింది. హౌరాలో గురువారం సాయంత్రం 5.40 గంటలకు బయల్దేరవలసిన హౌరా- తిరుచ్చిరాపల్లి (12664) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 8.30 గంటలకు బయల్దేరింది. బాలాసోర్-హల్దిపడ స్టేషన్ల మధ్య జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఆయా స్టేషన్‌లలో శుక్రవారం, శనివారం బయల్దేరవలసిన ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమర్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేశారు.

కేకే లైన్లో ..

వాల్తేర్ డివిజన్, కొత్తవలస-కిరండూల్ (కే-కే)లైన్, మనబార్-జరాటి స్టేషన్ పరిధిలో రైల్వేట్రాక్‌పై కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో ఇంకా పునరుద్ధరణ పనులు జరుగుతున్నందున ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. శుక్రవారం నుంచి 11వ తేదీ వరకు భువనేశ్వర్‌లో బయల్దేరే భువనేశ్వర్- జగదల్‌పూర్ (18447)హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగుప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరవలసిన జగదల్‌పూర్-భువనేశ్వర్ (18448) ఎక్స్‌ప్రెస్ శనివారం నుంచి 12వ తేదీ వరకు కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది. శుక్రవారం నుంచి 11వ తేదీ వరకు విశాఖలో బయల్దేరే విశాఖ- కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్-విశాఖ(18513)ఎక్స్‌ప్రెస్ శనివారం నుంచి 12వ తేదీ వరకు కోరాపుట్‌లో బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. శనివారం నుంచి 12వ తేదీ వరకు విశాఖ బయల్దేరే విశాఖ-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్-విశాఖ (08552) పాసింజర్ స్పెషల్‌గా శనివారం నుంచి 12వ తేదీ వరకు అరకులో బయల్దేరి విశాఖ చేరుకుంది. శుక్రవారం నుంచి 11వ తేదీ వరకు హౌరాలో బయల్దేరే హౌరా -జగదల్‌పూర్ (18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడుస్తోంది. తిరుగుప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరవలసిన జగదల్‌పూర్ - హౌరా(18006) ఎక్స్‌ప్రెస్‌గా శనివారం నుంచి 12వ తేదీ వరకు టిట్లాఘడ్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.